
కథ

# నీపాట నువ్వే కనుక్కో

**తాతయ్య ఉత్తరం రాసారు- నన్ను చూడాలని, వెంటనే రమ్మని. ఎక్కడా వణకని ముచ్చటైన గుండ్రని అక్షరాలతో డెభైఅయిదేళ్ల తాతయ్య రాసిన ఉత్తరం నన్ను కలవరపర్చింది.**

**తాతయ్యను చూసి ఎనిమిదేళ్లయింది. నా బాల్యంపై చెరగని ముద్ర వేసిన తాతయ్యను ఇన్నాళ్లూ ఎలా మర్చిపోగలిగాను? ఈ నగర వాతావరణంలో, ఈ నాగరిక ప్రపంచపు మత్తులో, పోటీలో, హడావుడిలో, అధునాతన భావజాలపు వెల్లువలో నన్ను నేనెక్కడ పోగొట్టుకున్నాను?**




నేను పల్లెలో ఏడోతరగతి పూర్తిచేసే వరకూ పెదనాన్నా, నాన్నా కలిసి ఉమ్మడి కుటుంబంగానే సంసారాన్ని నిర్వహించుకొచ్చారు. మా ముత్తాత కట్టించిన రాజభవనంలాంటి మేడ అది. అందమైన కట్టడం! పెద్దపెద్ద ద్వారబంధాలు! చుట్టూ పెరడు. పెరట్లో కొబ్బరి, జామ, నారింజ, ఉసిరి, మరెన్నో పూలచెట్లు- దూరంగా పశువులపాక, గడ్డివాము...

నాన్నగారికి పెళ్లయ్యాక తాతగారు సంసారబంధాలకీ, వ్యవసాయానికీ స్వస్తి చెప్పి, యాభైఎకరాల మాగాణినీ, ఇంటినీ కొడుకులకి పంచేసి, ఓ రెండు మూడెకరాలు మామిడితోటలో చిన్నకుటీరం నిర్మించుకుని ఆధ్యాత్మిక జీవితం ప్రారంభించారు.

ఎనిమిదేళ్ల క్రితం నాయనమ్మ చనిపోయినప్పుడు పల్లెకెళ్లాం. ఆ నాలుగు రోజులూ ముళ్లమీద కూర్చున్నట్లు గడిపేసి, 'అబ్బా! బైటపడ్డాంరా బాబూ!' అనుకుంటూ పల్లెదాటి మళ్లీ మా యాంత్రిక నగర జీవితంలోకి పరుగెత్తాం. హైదరాబాదులో అడుగుపెడుతూనే ఎంతో రిలీఫ్ ఫీలయ్యాం! పల్లె సెంటిమెంట్ల నుంచీ బైటపడినందుకు సంతోషించాం. చిన్నప్పుడు తాతగారు నాకు తోటపని నేర్పిస్తూ వృక్షశాస్త్రం, జీవశాస్త్రం, పనిముట్ల గురించి వివరించేవారు. తాతగారితో యోగాసనాలు వేస్తూవేస్తూ శరీర తత్వాన్ని గ్రహించాను. తాతగారి పిల్లంగోవి వింటూ కళల సారాన్ని అవగతం చేసుకోవటానికి ప్రయత్నించేవాడిని- నేడవన్నీ ఏమైనాయి? జీవితంలో నేర్చుకోవటమన్నది హరించుకుపోయి, సుకుమార మనోభావాలు మచ్చుకు కూడా లేకుండా- ఇల్లు, ఉద్యోగం; ఉద్యోగం- ఇల్లు... ఇవి తప్ప మరో పరమార్థం లేనట్లు- ఎందుకిట్లా అయిపోయాను?

నాకిద్దరు పిల్లలు. కొడుకు మురళి. కూతురు లలిత. నా భార్య వాళ్ళను సతాయిస్తోంది- "చూడు లల్లూ! సూర్యకాంతప్పువ్వు ఎక్కడన్నా ఎర్రగాఉంటుందా?" ఆమె పాప సైన్సు రికార్డుల్ని పరిశీలిస్తూ, ఆశ్చర్యపడి "ఇందుకే థర్డ్‌క్లాస్ వచ్చేది. ఏ పువ్వు ఏ రంగులో ఉంటుందో గుర్తుంచుకోవద్దా?"

పాప నా దగ్గరకు పరుగెత్తుకొచ్చింది. పాపను హత్తుకుంటూ అనుకున్నాను- 'నేను పల్లెలో పుట్టిపెరిగినవాణ్ణి! పూల అందచందాలు బాగా ఎరిగినవాణ్ణి. కానీ వీళ్లు, ఈ చీకటి అపార్టుమెంట్లల్లో సూర్యోదయాలూ, అస్తమయాలూ చూడకుండా పెరుగుతున్నవాళ్లు. పువ్వుల్ని చూడను కూడా చూడకుండా, వాటి సుగంధాల్ని శ్వాసించకుండా, వాటి లావణ్యాన్ని చేతుల్తో స్పృశించకుండా- కేవలం బుక్కిష్ నాలెడ్జితో పూలరంగులు తెలుసుకోవాలి'!

పరీక్షల్లో ర్యాంకులు తెచ్చుకోవాలని, వాళ్లచేత రేయింబవళ్లు 'చదువు- కంఠతాపట్టు- ఇంపోజిషన్ రాయి" అని ఆదేశిస్తున్నాం. ట్యూషన్లు పెట్టించి వేరే ధ్యాస, వేరే వ్యాపకం లేకుండా- మా ఆకాంక్షలకు వాళ్లను ఎలా మరమనుషులుగా మారుస్తున్నామో... వాళ్లకు తోటపనిలేదు. ఆసనాలు లేవు. చెరువులో ఈత కొట్టటం లేదు. లేత మామిడిపిందెల్ని రాల్చుకు తినటంలేదు. మామిడిచెట్ల చాటున దాగుడుమూతలాటలు లేవు. పెద్దమ్మచేసే పల్లె వంటకాల రుచులేవీ తెలీవు. మామిడి చెట్ల కొమ్మలకు తలకిందులుగా వేళ్ళాడుతూ పద్యాలు పాడుకోవటంలేదు. కోనేటి గట్టునో, లాకుల దగ్గరో, దేవాలయపు గోడల చాటునో, తాట తోపుల్లోనో ఆడపిల్లల్ని ఏడ్పిస్తూ సాహసకృత్యాలు చేసిన వీరోచిత క్షణాలు మా పిల్లలకు కరువైనాయి. భక్తి వేదాంతాల్లో ఆసక్తివున్నవారెవరో తాతగారితో మాట్లాడుతుంటే వాటిని వినే అవకాశమూ వీళ్లకు లేకపోయింది. ఈ సిటీలో, సిటీబస్సుల్లో వేళ్ళాడటానికే టైమంతా సరిపోతుంది. పిల్లలు టెక్స్ట్‌బుక్స్ కంఠతా పట్టటం కాకుండా, ప్రకృతిని పరిశీలించే అవకాశం ఎక్కడ? తీరిక దొరికితే సినిమా కబుర్లూ, క్రికెట్ కబుర్లూ... బాల్యంలోని భావుకతా, కుతూహలం, అన్వేషణా, ధైర్యం- ఇవన్నీ నాలోంచి ఎప్పుడు అదృశ్యమైనాయి? బాల్యంలో నే ప్రేమించిన తాతయ్య కూడా గుర్తు రానంతగా నేనెందుకిలా మారిపోయాను? పాప ఇంపోజిషన్ రాయకుండా ఏదో తుంటరిపని చేసినట్లుంది. నా భార్య పాప మీద విరుచుకు పడుతోంది.

"బస్సుల్లో వేళ్ళాడి, చచ్చీచెడీ ఆఫీసు నుంచీ వచ్చానా, నామీద నీకు జాలి కూడా లేదు. వచ్చీరాగానే ఇంత రెస్టన్నా తీసుకోకుండా మీకు వండి- వార్చటానికి రెడీ అయ్యానా. మీ పని మీరు చేసుకోకుండా నాకే ఒకటికి నాల్గు కల్పించేది..."

నేను సోఫాలోంచీ లేవకుండానే, తాతయ్య ఉత్తరాన్ని అలాచూస్తూ, ఆమెను గొంతు తగ్గించరాదా అన్నాను.

ఆమె కోపం నాపైకి తిరిగింది. "మీకేం! సోఫా దిగరు. ఇటు చూడండి. లల్లూ ఏంచేసిందో. అర్థరాత్రి పన్నెండింటికి లేచి కూర్చుని నీళ్ళు పట్టే నాకు తెలుస్తుంది. కంటినిండా కునుకులేదు. ఒంటికి రెస్టూ లేదు. ఛస్తున్నాను. ఎవళ్ళకోసం ఇదంతా-"

ఎవళ్ళకోసం ఇదంతా...

తాతయ్య ఉత్తరం నన్ను ఆప్యాయంగా పలకరించింది. అందులో పెద్దమ్మ ముఖం నవ్వుతోంది...

నేనూ, పెద్దమ్మ కొడుకు విశ్వం ఇద్దరమూ పెద్దమ్మను ఎన్ని తిప్పలు పెట్టేవాళ్ళం- సరిగ్గా పాప వాళ్ళమ్మను విసిగించినట్లే! కానీ పెద్దమ్మ ఏనాడయినా మమ్మల్ని పల్లెత్తు మాటందా?! దేవుళ్ళు అల్లరి చేస్తే తిడతామా, కొడతామా అని తనకు తాను చెప్పుకునేది. ఆమె ఒడిలో పడుకుని పాటలు వింటూ నిద్రలోకి జారిపోయేవాడిని- ఆ పెద్దమ్మను ఇన్నాళ్ళూ ఎలా మర్చిపోగలిగాను?

నా భార్య పిల్లల్నెందుకు కసురుకుంటుంది? వాళ్ళకెందుకు లాలిపాటలు పాడదు? కథలు చెప్పదు? జీవితంలో ఉదాత్త భావాలు మేల్కొనేటట్లు వాళ్ళతో ఎందుకు సున్నితంగా, అనునయంగా వ్యవహరించదు?- నా భార్య అలసిపోతోంది! మరి ఇద్దరమూ సంపాదిస్తేనే కానీ సిటీలో నెగ్గుకురాలేం కదా! పిల్లలు ర్యాంకులు తెచ్చుకోకపోతే ఈ కాంపిటీటివ్ ప్రపంచంలో నిలదొక్కుకోలేరుకదా! ఈ విషవలయంలో మేమేం పోగొట్టుకుంటున్నాం...

ఎద్దులబండి పెదనాన్న గారింటి ముందు ఆగింది. పెద్దమ్మ వాకిట్లోకి ఎదురొచ్చి- "ఎన్నాళ్ళయ్యిందిరా! ఇప్పటికన్నా ఈ పెద్దమ్మ జ్ఞాపకం వచ్చిందన్న మాట!" ఆమె కన్నుల్లో అశ్రువులు. నా భార్య ముఖం పక్కకు తిప్పుకుంది. ఈ పల్లెటూరి ఆప్యాయతలు ఆమెకు రుచించవు. ఇంతకుముందు వచ్చినపుడు ఈ ఆప్యాయతలు నాకూ విసుగు కలిగించినవే! కానీ ఇవ్వాళ- నేను పోగొట్టుకుందిదే- ఈ సెంటిమెంటే- అని గుర్తిస్తున్నాను. నాకూ, నా భార్యకూ మధ్య; నాకూ నా పిల్లలకూ మధ్య వున్న సంబంధాల్లో ఈ ఆప్యాయతే, ఈ సెంటిమెంటే లోపించిందనీ- అందరమూ మాకు తెలియని అధునాతన యాంత్రికతలో మమ్మల్ని మేం కోల్పోతున్నట్లు, సుందరమైన, అపూర్వమైన వర్తమానానికి దూరమౌతున్నట్లూ అనుభూతమౌతోంది.

పెద్దమ్మ మినప సున్నిండలు తెచ్చి నా నోట్లో పెడుతూ, "నీకు మినప సున్ని చాలా యిష్టంగా-" అంటూ బాల్యంలోని నా యిష్టాయిష్టాల్ని పైకి తోడింది.

మా మేడమీది గది కిటికీలోంచీ దూరంగా పోయే రైలుబండిని చూడటం ఎంత ఇష్టంగా ఉండేది! కొబ్బరిచెట్ల మీద చిలుకల సంగీతం వినటం ఎంత ఇష్టంగా ఉండేది! బత్తాయిరసం తీసి అందరికీ పంచటం ఎంత ఇష్టంగా ఉండేది! ఇప్పుడు నా యిష్టాలేమిటి?...

నన్ను చూడగానే తాతయ్య ముఖం వికసించింది. తప్పిపోయిన పిల్లాడ్ని అక్కున చేర్చుకున్నట్లు, సజల నయనాల్తో నన్ను కుటీరంలోకి తీసుకెళ్ళారు.

నాకు చిరపరిచితమైన వాటిని వెదుక్కుంటూ వెళ్ళాను.

కుటీరానికి దగ్గరగా ఓ మామిడిచెట్టు. దానిచుట్టూ నాపబండల అరుగు. దానిపైనే ఎన్నో సంవత్సరాలు తాతగారి వేణుగానం విన్నాను. వేణుగానం వింటూ సూర్యోదయాల్ని చూడటం ఎంత అద్భుతంగా ఉండేది! సిటీలో సూర్యోదయాల్ని చూడటాన్ని నేనెప్పుడు కోల్పోయాను? ఆఫీసు నుంచీ క్లబ్బు, క్లబ్బునించీ ఇంటికొచ్చేసరికి రాత్రి తొమ్మిదో, పదో అవుతుంది. అప్పటికి పిల్లలు నిద్రపోతారు. కాసేపు టీ.వీ. చూసి పదకొండుకో, పన్నెండింటికో పడుకుంటే తెల్లారి ఏడు, ఏడున్నరకి లేచేది. నా భార్య అర్ధరాత్రి పన్నెండింటికి నీళ్ళు పడుతుంది. నిద్ర లేస్తూనే గబగబా తయారై ఆత్రుతగా పరుగెత్తేది. ఇల్లు- ఆఫీసు- క్లబ్బు- టీ.వీ- ఇంతే జీవితం! ఒకళ్ళనొకళ్ళం ఎంటర్‌టైన్ చేసుకోవడానికే బతుకుతున్నట్లు! ఇష్టాయిష్టాలకూ దూరంగా బతకటం...

కిచెన్ గార్డెన్ వైపు నడిచాను. తాతయ్య కూరగాయలు కోస్తున్నారు. నేనూ ఆయనకు సాయం చేయాలనుకున్నాను. కానీ ఏదో మొహమాటం నన్ను అభ్యంతరపరిచింది. తాతయ్య బుట్ట నా చేతికిచ్చి, "అప్పట్లానే ఉందికదా తోట" అని పలకరించారు. "నీలాంటి వాళ్ళు ఎప్పుడొచ్చినా పచ్చగా ఉండాలని శ్రద్ధగా పెంచుతున్నాను. నువ్వే రాకుండా పోయావు" తాతగారి మాటలు నా గుండెల్నికోసాయి.

మేమెవ్వళ్ళం తాతయ్యకు బంధనాలు కాలేకపోయాం. అన్నింటినీ త్యజించిన తాతయ్యకి మా మీద ఎందుకింత ఆసక్తి? మా మీద అనురాగం ఎందుకింకా? నాకా క్షణంలో తోచలేదుకానీ, మా యాంత్రిక జీవితాల్నించీ మమ్మల్నివతలికి లాగి, మమ్మల్ని మేము తెలుసుకునేందుకే తాతయ్య మా మీద ఇంత ప్రేమను కురిపిస్తున్నాడనిపిస్తుంది-

నేను సెవెన్తు చదివేటప్పుడే పెదనాన్న, నాన్న విడిపోయారు. నాన్న తెనాలి మకాం మార్చారు. బియ్యం వ్యాపారం ప్రారంభించి పెద్ద వ్యాపారయిపోయారు. నేను పది దాకా తెనాల్లో చదివి, తర్వాత గుంటూర్లో కొనసాగించాను. ఎప్పుడో వేసవి సెలవల్లో పల్లెకొచ్చి తాతయ్యతో గడిపేవాడిని. నా పెళ్ళి అయ్యాక అపుడపుడు వచ్చినా, సిటీలో స్థిరపడ్డాక పూర్తిగా రావటమే మానేసాను. తాతయ్యకి దూరమైపోయాను-

పెద్దమ్మ పెద్ద ఆర్భాటమే చేస్తోంది. ఒకరోజు అరిసెలు. మరోరోజు కజ్జికాయలు. ఇంకోరోజు గారెలు- ఎంత శ్రమ! నా భార్యకు ఈ చాకిరీ ఏమీ నచ్చలేదు. కేవలం తినటంకోసం ఇంత చాకిరీ చెయ్యాలా?

నేను రహస్యంగా ఆమె చెవిలో అన్నా, "మనం తింటుంటే పెద్దమ్మ ముఖం ఎలా వెలిగిపోతుందో చూడు"

"ఆడోళ్ళం చాకిరి చెయ్యటానికేనా పుట్టింది?" నా భార్యలో అహం.

"మీ సిటీ స్లోగన్లు పెద్దమ్మ దగ్గరేం పన్చెయ్యవ్"

మొదట్లో నా భార్యాపిల్లలూ ఆ వాతావరణంలో ఇమడలేకపోయారు. మురళి పిల్లల్తో కలవలేకపోయాడు. వాడి సిటీ మేనరిజాలు పల్లె పిల్లల ముందు మనస్ఫూర్తిగా కలవనియ్యలేదు. కానీ పాప వెంటనే అందర్లోనూ కలిసిపోయింది. తాతగారి ఆంతరంగికురాలయింది-

"పాటలేకుండా ఎలా వుంటుందమ్మా? ప్రతి ఒక్కరికీ వారిదనే పాట తప్పకుండా ఉంటుంది. గాను గెద్దులాంటి జీవితంలో పడి మర్చిపోయి వుంటారు. నువ్వు పుట్టినప్పుడే పాట కూడా నీతోపాటే పుట్టింది. నీ గుండెల్లోకి చూసుకో నీ పాటను కనుక్కో-"

పున్నమి వెన్నెట్లో పెద్దమ్మ ఉసిరిచెట్టు కింద అన్నం ముద్దలు పెడితే, అల్లరి చేసుకుంటూ తినేసారు పిల్లలు. తర్వాత తాతగారి చుట్టూ చేరారు. తాతగారికి పిల్లంగోవి ఎలా దొరికిందో చెప్పమంటున్నారు.

హిమాలయాల్లోని తాతగారి గురువు దాన్ని తాతగారికిచ్చార్ట. గురువుగారికి ఒక తెల్లటి ఎలుగుబంటి దాన్నిచ్చిందట! తాతయ్య పిల్లల్ని వారివారి ఊహా జగత్తులోకి తీసుకెళ్ళారు-

"ఇది మామూలు పిల్లంగోవి కాదు, ఎవరుపడితే వారు వాయించటానికి. ఎవళ్ళయితే తన పాటను కనుక్కుంటారో వాళ్ళకు మాత్రమే ఇది పాడుతుంది"

పిల్లలు తాతయ్యను నీ పాటేమిటని అడిగారు. తాతయ్య తన పాటను పిల్లంగోవిలో విన్పించారు- హృదయపు లోతుల్నించీ- సంసార విషవృక్షానికి చిక్కి ఎందుకు పెనుగులాడుతావు. ఎందుకు నిన్ను నువ్వు పోగొట్టుకుంటావు. బైట పడు. ప్రకృతిని తెలుసుకో. జీవనకళను నేర్చుకో- అని!

పిల్లలు పిల్లంగోవిలో తమ పాట కనుక్కోవాలనుకున్నారు. అంతా పిల్లం గోవిలోకి గాలి ఊదారు. అది ఎవరికీ పలకలేదు. పాపకు కోపం వచ్చింది. నీకు పలికి మాకు పలకదెందుకని గొడవ పడింది. తాతయ్య నవ్వుతూ, 'మీ పాటల్ని మీరు కనుక్కోండి. కనుక్కొని రేపు దీన్లో ఊదండి'

పాప తనకేమీ పాటలేదంది. తాతయ్య పాప జుత్తు నిమురుతూ, "పాటలేకుండా ఎలా వుంటుందమ్మా? ప్రతి ఒక్కరికీ వారిదనే పాట తప్పకుండా ఉంటుంది. గాను గెద్దులాంటి జీవితంలో పడి మర్చిపోయి వుంటారు. నువ్వు పుట్టినప్పుడే పాట కూడా నీతోపాటే పుట్టింది. నీ గుండెల్లోకి చూసుకో. నీ పాటను కనుక్కో-"

పిల్లలందరూ వెళ్ళిపోయారు. తాతయ్యకు ఎదురుగ్గా నేను మిగిలాను. నా పాటేమిటి? నాక్కూడా ఒక పాట ఉందా?

ఆ రాత్రంతా మేలుకునే ఉన్నాను. నా పాటేమిటో నాకు స్ఫురించలా. తోటలో కొచ్చి కూర్చున్నాను. వెన్నెట్లో పొలంగట్ల పై నడిచాను. ఆరుబయల్లోకి వచ్చి చందమామను చూస్తూ పడుకున్నాను. నాపాటేమిటో చెప్పమని వెన్నెలనీ, వరిపైరునీ, మామిడిచెట్లనీ, మట్టినీ అడిగాను. ఆ సుందర నిశ్శబ్దంలో ఒక్క గుడ్లగూబలూ, చందమామా తప్పించి మరెవ్వరూ మేల్కొనిలేరు. నాలోని గుడ్లగూబ మనస్తత్వం నా ముందు సాక్షాత్కరించింది. ఇంత చిన్నవయసులో మెట్టు మెట్టే ఎక్కి, జీవితంలో పైకి రావటానికి ఎన్ని కన్నింగ్స్ చేస్తుంటాను. వంచన చేయటం, వంచన కావటం జీవితంలో భాగమైపోయింది! సంపాదన, పదవులు, అధికారం- జీవితం వీటికోసమే అన్నంతగా వేరే ఆలోచన, వేరే సృజనాత్మక వ్యాపకం ఏదీలేకుండా ఎలా గడిపేస్తున్నాను?!

నాలోని చందమామ నన్నుచూసి వెక్కిరించాడు. నాకుగానీ, నా పెళ్ళాం పిల్లలకుకానీ శాంతి లభిస్తోందా? స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్ సూత్రం ప్రకారం మేమంతా బతకటం కోసం, కేవలం బతకటం కోసం కుస్తీపట్లు పడుతున్నాం. ఆతృత, ఆరాటం, అలసట- మృతప్రాయమైన చిర్నవ్వు ధరించి రాజీపడటం మేము మేముకాదు. మాకు మేము జాలిపడటానిక్కూడా మా దగ్గరేం మిగిలిలేదు.

నిన్న రాత్రి మిగిలిన పిల్లలు వెన్నెట్లో ఆడుకుంటుంటే, నా భార్య పిల్లల ముందు టెక్స్ట్‌బుక్స్ పడేసి చదువుకోమని బలవంతం చేస్తోంది. చదువు, ఉద్యోగంకాక మరేమీ జీవితాదర్శం కానట్లు!

నిన్న సాయంత్రం పాప పరుగెత్తుకొని వచ్చి, నన్ను లాక్కునివెళ్ళి అనేక వింతలు చూపించింది- పూలపై ఎగిరే సీతాకోకచిలుకలూ, తూనీగలూ దానికి సంబరం కలిగించాయి. కొబ్బరిచెట్లమీది గోరింకలూ, ఉడుతలూ, ఇన్ని రకాల మొక్కలూ, పంటలూ, పండ్లచెట్లూ, పూలూ ఇవన్నీ పాపకు కలిగించిన ఆశ్చర్యానికి హద్దు లేకుండా పోయింది! సిటీలోని ఇరుకు గదుల్నించీ, ఇంత విశాలమైన, భిన్నవర్ణాత్మకమైన, వైవిధ్యభరితమైన ప్రకృతి దాన్ని పరవశింపచేసింది-

నా పాటేదో నాకు అర్థమవుతోంది...

సహజత్వానికి దూరంగా మాలో మేమెలా దుర్గాలను కట్టుకొంటున్నాం. కాంపిటీటివ్ వరల్డ్, స్పీడ్‌యుగం అనే పేర్లు తగిలించుకొని, రిజిడ్ అయిపోయి, లోని అవస్థల్ని పైకి కనిపించనీయకుండా, నవ్వుతూ, హుందాగా ఉండటానికి ఎలా ప్రయత్నిస్తున్నాం- యాంత్రికంగా! మనిషికీ మనిషికీ మధ్య మరిన్ని గోడలు లేస్తున్నాయే తప్ప నిజానికి మేము సాధిస్తున్నదేమిటి?

నాకేం కావాలి? నాకేం కావాలి?

నేను ప్రేమించాలి- ప్రేమించగలిగిన వ్యక్తిని కావాలి!

చందమామ పడమటి దిక్కుకు వాలిపోతున్నాడు. ఉదయం నాలుగు గంటలు దాటి వుంటుంది. తాతయ్యా, తాతయ్య వేలు పట్టుకొని పాపా వచ్చి నా పక్కనించున్నారు. అది తాతయ్య స్నానానికి వెళ్ళే సమయం. మోటారు వేసుకుని, విశాలమైన పెద్ద తొట్లో స్నానాలు చేస్తారు. వాళ్ళు నన్నూ కలుపు కున్నారు. ఆ స్నానం నన్ను క్షాళనం చేసింది. నా లోపలి కాంక్షల్ని, లోభాల్నీ, అన్నింటినీ కడిగేసి నాకొక నూతనోత్తేజాన్నిచ్చింది! పాపలాగా పిల్లవాడ్నయి ఆ నీటి తొట్లో పాపతో ఆడుకున్నాను- నా పాట పాడుతూ! ●

## శిల్ప కష్టాలు తీరేదెప్పుడు?



ఏడేళ్ళ కిందట 'బాజీగర్' హిట్టయ్యాక శిల్పాశెట్టి మీద బాలీవుడ్ నిర్మాతలు చాలా ఆశలు పెట్టుకున్నారు. కాని అనుకున్న రీతిన వారి ఆశలు ఫలించలేదు. దీంతో ఆ తర్వాత ఆమెకు ఎక్కువ అవకాశాలు రాలేదు. మూడేళ్ళ కిందట ప్రారంభించిన దడ్కన్ చిత్రం మీదనే ఆమె ఇప్పుడు ఆశలు పెట్టుకున్నారు. ఈ చిత్రం విడుదలయితే భారీ హిట్టవుతుందని, మళ్ళీ పురా వైభవం వస్తుందని శిల్ప ఆశిస్తున్నారు. ప్రస్తుతానికి తెలుగులో నాగార్జున, బాలకృష్ణలతో రెండు చిత్రాల్లో నటిస్తున్నారు. ఉత్తరాదిలో సక్సెస్ కాని శిల్ప దక్షిణాది ప్రేక్షకుల్ని ఎంత వరకు మెప్పించగలదో చూడాలి. వ్యక్తిగత జీవితానికి వస్తే అక్షయ్ కుమార్‌తో సంబంధాలు తెగిపోయాయి. ఒకప్పుడు ఈ ఇద్దరూ పెళ్ళి చేసుకుంటారన్న మాట పుకారుగానే మిగిలిపోయింది. ఇప్పుడు అక్షయ్, తను కేవలం మిత్రులేనంటోంది శిల్ప. కెరీర్‌లోనూ, పర్సనల్ లైఫ్‌లోనూ ఏర్పడిన శిల్ప కష్టాలు ఎప్పుడు తీరుతాయో చూడాలి! ●